




# కరపత్రం

SINCE 2014

శనివారం సెప్టెంబర్ 20 2025 | సంపుటి :0 | సంచిక :332 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## రాహుల్ ప్రెస్‌మీట్‌లో ఫోన్ నంబర్..

### ఆ వ్యక్తికి కాల్స్ మోత




ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయోగ్‌రాజ్‌కు చెందిన అంజనీ మిశ్రా అనే వ్యక్తికి గురువారం నుంచి ఉన్నట్టుండి విపరీతంగా ఫోన్ కాల్స్ 2లో

## ఈసీ కీలక నిర్ణయం..

## 474 రాజకీయ పార్టీలపై వేటు..


దేశవ్యాప్తంగా గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలపై కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి చర్యలు చేపట్టింది. నిబంధనలు ఉల్లంఘించిన 474 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు ప్రకటించింది.



2లో

## 'మన శరీరం తిరుగుబాటు చేస్తుంది':

### ఐఎస్ఎస్ అనుభవాన్ని వెల్లడించిన శుభాంశు శుక్లా



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం లోకి వెళ్లిన తొలి భారతీయ వ్యోమగామిగా శుభాంశు శుక్లా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఆయన అంతరిక్షంలో ఎదుర్కొన్న ఆరోగ్య సమస్యల గురించి తాజాగా వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. 2లో




## హైదరాబాద్-బెంగళూరు

### మధ్య బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం: రేవంత్‌రెడ్డి








- **హైదరాబాద్ అభివృద్ధి:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు.
- **తెలంగాణ రైజింగ్ 2047:** రాష్ట్ర సుస్థిరాభివృద్ధి కోసం ప్రైవేటు రంగం మద్దతుతో 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికను రూపొందించారు.
- **మెట్రో విస్తరణ:** ప్రస్తుతం 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రోజుకు 5 లక్షల మంది ప్రయాణికుల సంఖ్యను ఐదేళ్లలో 15 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పేజి 2లో ▶



# వచ్చే నెలలో మోదీ-ట్రంప్ భేటీ..?

ఆపరేషన్ సిందూర్ పై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు, భారత్‌పై టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

- **మలేసియా ప్రధాని ప్రకటన:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆసియాన్ సమావేశానికి వస్తారని మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం తెలిపారు.
- **క్వాడ్ సదస్సు:** మోదీ పుట్టినరోజు సందర్భంగా ఫోన్‌లో మాట్లాడినప్పుడు, ఏడాదిలో ఇండియాలో జరగనున్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సుకు రావాలని మోదీ ట్రంప్‌ను కోరగా ఆయన అంగీకరించారు.
- **రష్యా చమురు - టారిఫ్‌లు:** రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్నందున భారత్‌పై టారిఫ్‌లు విధించాల్సి వచ్చిందని ట్రంప్ పేర్కొన్నారు.

త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్నారు. అక్టోబరులో మలేసియా వేదికగా జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశాని కి ప్రధాని మోదీ, ట్రంప్ హాజరవుతారు. ఈ సదస్సుకు అనుబంధంగా మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరిగే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ అనంతరం ఇరుదేశాల నేతలు మొదటిసారి భేటీ అవనున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ట్రంప్ వ్యాఖ్యలు, భారత్‌పై టారిఫ్‌ల వేళ ఈ భేటీ జరుగుతుండడంతో ఇప్పుడు అందరి దృష్టి దానిపైనే ఉంది. పేజి 2లో ▶



# యూరియా కోసం బారులు..

# రైతుల మధ్య తోపులాట

కారేపల్లి: ఖమ్మం జిల్లా కారేపల్లిలో యూరియా కోసం వేలసంఖ్యలో రైతులు బారులు తీరారు. ఐదు రోజులుగా యూరియా సరఫరా లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. లారీ లోడు యూరియా వస్తున్న నేపథ్యంలో ముందస్తుగా రైతులకు అధికారులు కూపన్లు ఇచ్చే ప్రక్రియ చేపట్టారు. దీంతో కారేపల్లి మండలంలోని 41 పంచాయతీల నుంచి 3వేలకు పైగా రైతులు కూపన్ల కోసం క్యూలైన్లలో నిలుచున్నారు. ఈ క్రమంలో పలుమార్లు తోపులాట చోటుచేసుకుంది. రైతులకు సర్దిచెప్పేందుకు పోలీసులు ఇబ్బందులు పడ్డారు.



## కవిత వ్యవహారం..

### కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమే: సీఎం రేవంత్



దిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులపై నిర్దిష్ట నియమాలు ఏవీ స్పష్టంగా లేవని పేర్కొన్నారు. పేజి 2లో ▶

## ఆ నేతలకు ఇప్పుడే విలువలు గుర్తుకొచ్చాయా?: కడియం శ్రీహరి



హనుమకొండ: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి వెళ్తున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఇక్కడి ప్రగతికి సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విధాలుగా అండగా ఉన్నారని చెప్పారు. హనుమకొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు గోదావరి జలాలను తీసుకొచ్చినట్లు వివరించారు.

పేజి 2లో ▶

## కాళేశ్వరంతో పోలిస్తే మూడో వంతు ఖర్చు.. కానీ పదో వంతుకూ నీళ్లు ఇవ్వరట: హరీశ్‌రావు



హైదరాబాద్: తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి ఖర్చు రూ.35 వేల కోట్లు అట అని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. "ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుతో 4.47 లక్షల ఎకరాలకే సాగునీరట. ఇందులో నీటి వినియోగం 80 టీఎంసీలు మాత్రమేనట. కాళేశ్వరంతో పోలిస్తే మూడో వంతు ఖర్చు చేస్తూ.. పదో వంతుకూ నీళ్లు ఇవ్వరట. రూ.35 వేల కోట్లు ఖర్చు చేసి 4.47 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలనేది అద్భుతం. కాంగ్రెస్ ప్రభుత్వ ఇంజినీరింగ్ నైపుణ్యానికి ఇది మరో మచ్చుతునక. ఇది కదా అసలైన మార్పంటే?" అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

## కోకాపేట్‌లో దారుణం..

### కత్తితో దాడి చేసి భర్తను హతమార్చిన భార్య

హైదరాబాద్: కోకాపేట్‌లో దారుణం చోటు చేసుకుంది . భర్తను భార్య హత్య చేసింది. స్థానికుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి కృష్ణజ్యోతి బోరా, భారాకా బోరా దంపతుల మధ్య గొడవ జరిగి.. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈక్రమంలో భార్య కత్తితో భర్తపై దాడి చేసింది. కేకలు విని స్థానికులు అక్కడికి వెళ్లారు. పేజి 2లో ▶



## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మణికొండ, గచ్చిబౌలి, నారాయణగూడ, హిమాయత్‌నగర్, సనత్‌నగర్, నాంపల్లి, కోఠి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, ఎల్బీనగర్, నాగోల్, మన్సూరాబాద్, వనస్థలిపురం, హయత్‌నగర్, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్, అబ్దుల్లాపుర్‌మెట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం పడుతోంది. రోడ్లపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి. పలుచోట్ల ట్రాఫిక్ రద్దీ నెలకొనడంతో పోలీసులు క్లియర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.



## ఒడిశా To గుజరాత్:

### ఏపీ మీదుగా మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్

భారతీయ రైల్వే మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును త్వరలో ప్రారంభించనుంది. ఒడిశా, గుజరాత్‌లను కలుపుతూ ఏపీ మీదుగా ఈ రైలు నడపనుంది. ఒడిశాలోని బ్రహ్మపుర,

పేజి 2లో ▶



# ఉత్తరాఖండ్‌లో విధ్వంస వికాసం

ఉత్తరాఖండ్ రాష్ట్రం 2000 సంవత్సరంలో నవంబర్ 9న ఏర్పాటయింది. ఆ శుభ వేడుకలు ఇంకా పూర్తిగా ముగియకముందే ముస్సోరిలో ఒక ఉపన్యాసం వెలువరించేందుకు నాకు ఆహ్వానం అందింది. ఆ ఆహ్వానాన్ని అంగీకరించాను. ఆ రాష్ట్రంలోని ప్రధాన నగరాలలో ఒకటైన డెహ్రాడూన్‌లోనే నేను పుట్టి పెరగడమే అందుకొక కారణం. ముస్సోరికి వెళ్లిన తరువాత నా బసకు సమీపంలో ఉన్న ఒక పబ్లిక్ కాల్ బూత్ (అప్పటికి ఇంకా సెల్ ఫోన్లు లేవు)కు వెళ్లి నైనిటాల్‌లో ఉండే చరిత్రకారుడు శేఖర్ పాఠక్‌కు ఫోన్ చేశాను. నా మిత్రుడు ఫోన్ ఎత్తగానే నేను ఇలా సగర్వంగా ప్రకటించాను: ‘మై అప్నే ప్రదేశ్ సె బోల్ రహా హూ’ (నేను నీతో మన రాష్ట్రం నుంచి మాట్లాడుతున్నాను). ఇప్పుడు బెంగళూరులో స్థిరపడినప్పటికీ నేను యువకుడుగా ఎదిగిన, నా తొలి పరిశోధనను నిర్వహించిన ప్రదేశంతో నా ఆత్మీయ సంబంధాలను కొనసాగిస్తున్నాను. ఉత్తరప్రదేశ్‌లోని పర్వత ప్రాంత జిల్లాలతో ఒక ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకై అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ ప్రజలు నిర్వహించిన ఉద్యమాన్ని మొదటి నుంచి చివరివరకు నేను ఆసక్తితో గమనించాను. తుదకు ఉత్తరాఖండ్ ఏర్పడినప్పుడు ‘దేవ భూమి’గా ప్రసిద్ధిగాంచిన ఆ హిమాలయ ప్రాంతాల ప్రజల జీవితాలలో కొత్త యుగోదయాన్ని ఆకాంక్షించాను. 1971లో హిమాచల్‌ప్రదేశ్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ప్రభవించిన తరువాత ఆ రాష్ట్ర ప్రజలు గణనీయమైన సామాజిక, ఆర్థిక పురోగతి సాధించిన విధంగానే ఉత్తరాఖండ్ వాసులు తమ సొంత రాష్ట్రంలో సర్వతోముఖమైన ప్రగతి సాధించగలరని భావించాను. నా నమ్మకానికి కారణమేమిటి? ఆ కొత్త రాష్ట్రాన్ని పాలించే రాజకీయవేత్తలు తమ పాలితులతో ఉమ్మడి సాంస్కృతిక నేపథ్యమున్నవారే కాక, ప్రజల ఆశలు, అభిలాషలలో భాగస్వాములుగా ఉండడమే. మరో కొద్ది వారాలలో ఉత్తరాఖండ్ 25వ ఆవిర్భావ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నది. ఈ పాతికేళ్ల కాలంలో కాంగ్రెస్ పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండగా భారతీయ జనతా పార్టీ పదిహేనేళ్లు పాలించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర రజతోత్సవాలను చాలా ఘనంగా నిర్వహిస్తుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు రెండూ ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు చేసింది చాలా తక్కువ అనేది ఒక చేదు సత్యం. విద్యా వైద్య రంగాలను రెండు పార్టీల ప్రభుత్వాలూ ఒకే విధంగా నిర్లక్ష్యం చేశాయి. మహిళలకు రక్షణ కల్పించడంలోను, జీవనోపాధులకు భద్రత సమకూర్చడంలోనూ అన్ని ప్రభుత్వాలూ విఫలమయ్యాయి. 2017 నుంచి అధికారంలో ఉన్న బీజేపీ హిందూత్వ భావజాలాన్ని ప్రోత్సహిస్తోంది. మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శిస్తోంది. భయపూరిత వాతావరణాన్ని సృష్టించి మత సామరస్యానికి విఘాతం కలిగిస్తోంది. ఇదిలావుండగా ఉత్తరాఖండ్‌లో అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వమూ కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో ‘అభివృద్ధి’ పేరిట పర్యావరణ విధ్వంసానికి పాల్పడడం పరిపాటిగా ఉన్నది. కొండలు తొలిచివేస్తున్నారు. నాణ్యత లేని రోడ్లు నిర్మిస్తున్నారు. ఆలోచనారహితంగా భారీ డ్యాంల నిర్మాణానికి పూనుకుంటున్నారు. చార్ ధామ్ హైవే ఈ ప్రాజెక్టులలో అత్యంత ప్రమాదకరమైనది. ప్రజలు, పర్యావరణానికి ఈ ప్రాజెక్టు హానికరమైనదని నిరాకరించలేని శాస్త్రీయ సాక్ష్యాధారాలు నివేదించినప్పటికీ ఆ హైవే నిర్మాణాన్ని కొనసాగించేందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం అనుమతినిచ్చింది. ఒక సాధికారిక అంచనా ప్రకారం 2000 సంవత్సరంలో ఏర్పడినప్పటి నుంచీ ఇప్పటివరకు హై వేలు, డ్యాంలు, గనులు, ప్రభుత్వ బస్తీలు మొదలైన ‘అభివృద్ధి ప్రాజెక్టుల’ పేరిట 50 వేల ఎకరాల సహజ అడవిని కోల్పోయింది. ఆ ‘అభివృద్ధి’ నుంచి ప్రజలు రవ్వంత కూడా లబ్ధి పొందలేదు. ఎంత తక్కువగా అంచనా వేసినా ప్రతి హెక్టారు సహజారణ్యంలో 3000 వృక్షాలు ఉంటాయి. హరించుకుపోయిన 50 వేల హెక్టార్లలో ఇంచుమించు 15 కోట్ల వృక్షాలు ఉండవచ్చు. ఉత్తరాఖండ్ ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వమే ఆ వృక్ష సంపదను సంపూర్ణంగా నిర్మూలించింది. ఈ సహజ సంపద విధ్వంసకాండ ఆర్థిక, పర్యావరణ వ్యయాలు అగణితమైనవి.

హిమాలయాల పర్యావరణ వ్యవస్థ సున్నితమైనది. భూకంపాలు సంభవించే ప్రాంతంలో హిమాలయాలు ఉన్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పోషణకే కాకుండా నేల కోత, వరదల నుంచి రక్షణకు కూడా దట్టమైన అడవులు విలసిల్లడం చాలా అవసరం. హైవేలు, రైళ్ల మార్గాలను నిర్మించేందుకు కొండలు తొలిచి సొరంగాలు నిర్మిస్తున్నారు. సదరు కొండ ప్రాంతాలను కాంక్రీట్ నిర్మాణాలతో నింపివేస్తున్నారు. ఈ పర్యావరణ విరుద్ధ నిర్మాణాలతో వరుసగా అనేక ఘోర ప్రమాదాలు, విపత్తులు సంభవించాయి. ధరాలిలో చోటుచేసుకున్న దుర్ఘటన ఈ ప్రమాదాలలో చాలా ఇటీవలది. భూపాతాల కారణంగా చోటుచేసుకున్న మానవ మరణాలు, ఆస్తినష్టం లెక్కకు మించి జరిగింది. ఇటీవలి కాలంలో వరదలు తరచుగా సంభవిస్తున్నాయి. పెద్ద ఎత్తున ప్రాణనష్టానికి ఇవి దారితీశాయి. జీవనాధారాలకు వాటిల్లిన నష్టం అపారమైనది. ఈ దుర్ఘటనలను పాలక పక్షాలు ‘ప్రాకృతిక విపత్తులు’గా పరిగణిస్తున్నాయి. నిజానికి అవి మానవుల విచక్షణారహిత కార్యకలాపాల మూలంగానే సంభవించాయి. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై స్వప్రయోజనాలకై రోడ్ల విస్తరణ, డ్యాంల నిర్మాణాలు, రిసార్ట్స్ ఏర్పాటుకు ముందు వెనుకలు చూడకుండా అనుమతినిస్తున్నారు. ప్రకృతి పరిరక్షణకు, సమాజశ్రేయస్సుకు తోడ్పడని ఈ ప్రాజెక్టులు తరచు విపత్తులకు దారితీస్తున్నా ఉత్తరాఖండ్‌ను పరిపాలిస్తున్నవారు లబ్ధి పొందుతున్నారు. డెహ్రాడూన్‌లో బిందాల్, రిస్పాన నదులపై తలపెట్టిన రెండు ఎలివేటెడ్ హైవే (నేలమట్టం లేదా నదీతలానికి పైన ఎత్తుగా నిర్మితమయ్యేవి)లనే తీసుకోండి. ఒక్కోటి పది కిలోమీటర్లకు పైగా పొడవు ఉంటుంది. ఏమిటి వీటి లక్ష్యం? అధికారికంగా చెప్పకపోయినప్పటికీ మైదాన ప్రాంతాల నుంచి డెహ్రాడూన్‌లోకి ప్రవేశించిన పర్యాటకుల వాహనాలు శీఘ్రగతిన ముస్సోరికి చేరేందుకు సౌలభ్యాన్ని కల్పించడమేనన్నది స్పష్టం. ఒక్కో ఎలివేటెడ్ హైవే నిర్మాణ అంచనా వ్యయం రూ.6000 కోట్లు. ఇది మరింతగా పెరుగుతుందనడంలో సందేహం లేదు. వీటి నిర్మాణానికి చట్టబద్ధంగా నిర్మాణమైన వేలాది గృహాలు, ఇతర కట్టడాలను కూల్చివేయవలసి ఉంటుంది. పెద్ద ఎత్తున నేల కోత సంభవిస్తుంది. వంతెనల స్తంభాలు సహజ ప్రవాహాన్ని అడ్డుకోవడం వల్ల ఆకస్మిక వరదలు పెరిగిపోయే ప్రమాదమున్నది. వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఎలివేటెడ్ హైవేల ప్రత్యక్ష లబ్ధిదారులు కాంట్రాక్టర్లు కాగా పరోక్ష లబ్ధిదారులు కార్ల ఉత్పత్తిదారులు, వాటి పంపిణీదారులు అని డెహ్రాడూన్ పౌరసమాజ బృందం ఒకటి విమర్శించింది. ఈ హైవేల నిర్మాణాలకు బిందాల్, రిస్పాన నదుల నుంచి లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్విపోయవలసి వుంటుందని, దీనివల్ల వరదల సంభవత పెరుగుతుందని డెహ్రాడూన్ నివాసి అయిన భారతి జైన్ అన్నారు. డెహ్రాడూన్ పరిసర ప్రాంతాలలో భూగర్భ జలాల పెరుగుదలకు విశేషంగా తోడ్పడే ఈ నదులలో మట్టి తవ్వకాలు, జల ప్రవాహాలకు ఆటంకాల వల్ల వర్షాకాలంలో వరదలు, వేసవిలో కరువులు వస్తాయని ఆమె తెలిపారు. డెహ్రాడూన్ ప్రాంతం ఇప్పటికే భూగర్భ జలాల కొరత నెదుర్కొంటుందని, రిస్పాన%–%బిందాల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం వల్ల వాహనాల రాకపోకలకు సౌలభ్యం కలగవచ్చునేమో కానీ దానివల్ల జల భద్రత, పర్యావరణ సమతుల్యతకు ప్రమాదమేర్పడుతుందని ఆమె అన్నారు. తాత్కాలిక వెసులుబాటు లేదా దీర్ఘకాలిక ప్రయోజనాలలో నొకదాన్ని డెహ్రాడూన్ పౌరులు ఎంచుకోవల్సిన సమయమాసన్నమయిందని భారతి జైన్ స్పష్టం చేశారు. ఈ హైవేల నిర్మాణంపై డెహ్రాడూన్ పౌరులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని ఇటీవల ఒక సర్వేలో వెల్లడయింది. వీటితో పాటు ఢిల్లీ%–%డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణాన్ని కూడా చేపట్టనున్నారు. వీటివల్ల డెహ్రాడూన్ పౌరులకు సమకూరే తాత్కాలిక సామాజిక ప్రయోజనాలు స్వల్పం కాగా దీర్ఘకాలిక పర్యావరణ, సామాజిక నష్టాలు చాలా తీవ్రంగా ఉంటాయి. పర్యాటకులకు అవి ఏ విధంగా లబ్ధి కలిగిస్తాయి అన్నది తెలియదు. ఈ హైవేల నిర్మాణం పూర్తయితే ముస్సోరిలోకి ప్రతిరోజూ అదనంగా వేలాది చిన్నకార్లు, బస్సులు ప్రవేశిస్తాయి. ఈ పర్యాటకుల రద్దీని ఎలా తట్టుకుంటారు? అదనపు వాహనాల వెల్లువ సృష్టించే ట్రాఫిక్ జామ్‌లను ఎలా నివారిస్తారు? వాహనాలను తాత్కాలికంగా నిలపడానికి కొండ పక్కన పది అంతస్తుల పార్కింగ్ సదుపాయాన్ని నిర్మించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం పూనుకోనున్నదా? ఉత్తరాఖండ్ విలక్షణ భౌగోళికత, చరిత్ర, సంస్కృతి గురించి మన కాలంలో మరెవ్వరికి కంటే సమగ్రంగా తెలిసిన శేఖర్ పాఠక్ తన విద్వత్ ప్రాజ్ఞతతో ఒక వివేకవంతమైన వ్యాఖ్య చేశారు: ‘ప్రాకృతిక జగత్తు, జన సమూహాల వైవిధ్య జీవన రీతులను గౌరవిస్తూ నిదానంగా, నిరాడంబరంగా జరిగే పుణ్యక్షేత్రాల సందర్శన యాత్రలా పర్యాటకాన్ని రూపొందించుకోవల్సి ఉండగా ప్రకృతి, ప్రజలకు విధ్వంసాన్ని కాలుష్యాన్ని మిగిల్చే ఆర్భాటపూరిత పర్యాటకంలా తీర్థయాత్రలను తీర్చిదిద్దాలని ప్రభుత్వాలు ఆకాంక్షిస్తున్నాయి’ అని పవిత్ర క్షేత్రాల సందర్శనలా పర్యాటక రంగాన్ని పునః రూపకల్పన చేయడమనేది ఉత్తరాఖండ్‌ను ప్రస్తుతం పరిపాలిస్తున్న రాజకీయవేత్తల, అధికారుల ప్రధాన ప్రాధాన్యత అవ్వాలి. మరింత మెరుగైన, అందరికీ అందుబాటులో ఉండే పాఠశాలల, ఆసుపత్రుల నిర్వహణ, తద్వారా ఆ హిమాలయ రాష్ట్ర ప్రజలకు సుస్థిర ఆర్థిక భవిష్యత్తును సమకూర్చడం ఉత్తరాఖండ్ పాలకులకు రెండవ, బహుశా మరింత ముఖ్యమైన ప్రాథమ్యం కావాలి. ఉత్తరాఖండ్ ఆవిర్భావానికి ప్రేరణ అయిన ఉదాత్త ఆకాంక్షలు, సమున్నత లక్ష్యాలు ఇప్పటికీ చాలా స్వల్పంగా మాత్రమే నెరవేరాయి. వాటిని సంపూర్ణంగా సాకారం చేయవలసిన బాధ్యత ఉత్తరాఖండ్ ప్రస్తుత, భావి పరిపాలకులపై ఉన్నది

## హైదరాబాద్-బెంగళూరు

### మధ్య బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం: రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ: హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన ఓ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 2047 నాటికి తెలంగాణ ప్రాధాన్యత రంగాలను వివరించారు. రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి ప్రైవేటు రంగం మద్దతు గురించి తెలిపారు. అభివృద్ధి కోసం ‘తెలంగాణ రైజింగ్ 2047’ రూపొందించుకున్నట్లు చెప్పారు.

“హైదరాబాద్‌లో కోటి మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. నగరంలో ఆర్‌ఆర్‌ఆర్ కూడా నిర్మిస్తున్నాం. ప్రస్తుతం 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లకు విస్తరిస్తున్నాం. మెట్రోలో ప్రస్తుతం రోజుకు 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో ఆ సంఖ్యను 15 లక్షలకు పెంచాలనేదే మా లక్ష్యం. గుజరాత్‌లోని సబర్మతీ తీరంలా మూసీ తీరాన్ని అభివృద్ధి చేస్తాం. దీనికోసం మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. కాలుష్య కారక పరిశ్రమలను హైదరాబాద్ వెలుపలకు తరలిస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నాం. విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి కనెక్టివిటీ ఏర్పాటు చేస్తాం. హైదరాబాద్–బెంగళూరు మధ్య బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తాం. డ్రగ్స్ కట్టడిలో మా రాష్ట్ర పోలీసులు దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నారు. 2034 కల్లా ట్రిలియన్ డాలర్ల, 2047 కల్లా మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది మా లక్ష్యం. దేశ జీడీపీలో 10 శాతం తెలంగాణ నుంచే రావాలనేది మా ధ్యేయం” అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## కవిత వ్యవహారం..

### కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమే: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి

“ఎమ్మెల్యేలు పార్టీ మారిన అంశంపై భారత రాష్ట్ర సమితి నేతలకే స్పష్టత లేదు. ఆ పార్టీకి 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని అసెంబ్లీలో హరీశ్ రావు అన్నారు. 37 మంది కాదని కేటీఆర్ ఇంకో సంఖ్య చెప్తున్నారు. ఇంటికొచ్చిన వాళ్లకు కండువా వేస్తే పార్టీ మారినట్లు అవుతుందా..?” అని సీఎం ప్రశ్నించారు.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఈ సందర్భంగా సీఎం చెప్పారు. “బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి మూడు బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రపతి నిర్ణయం తీసుకునే గడువు అంశం సుప్రీంకోర్టులో ఉంది. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం ఏం చెప్తుందో వేచి చూస్తున్నాం. న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. మళ్లీ కోర్టుకు వెళ్లాలా? వద్దా? అనేది అప్పుడే నిర్ణయం తీసుకుంటాం” అని సీఎం తెలిపారు.

కవిత వ్యవహారం అంతా కుటుంబం, ఆస్తి పంపకాల వివాదమేనని సీఎం వ్యాఖ్యానించారు. “ఒక ఆడబిడ్డపై నలుగురు కలిసి దాడి చేస్తున్నారు. కుటుంబ వ్యవహారంతో సామాన్య ప్రజలకు ఏం సంబంధం? కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు సామాజికంగా బహిష్కరించారు. 2014–19 మధ్య కేసీఆర్ కేబినెట్‌లో ఒక్క మహిళ కూడా లేరు. ఉద్యమం పేరుతో ఆయన కొన్ని వందల మంది పిల్లల ఉసురు పోసుకున్నారు.. అది ఊరికే పోదు. హైదరాబాద్ మెట్రో విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కేటీఆర్ కలిసి అడ్డంకులు సృష్టిస్తున్నారు. ‘ఎల్ అండ్ టీ’తో ఒప్పందం చేసుకుంటేనే అనుమతులు ఇస్తామని కేంద్రం చెబుతోంది. కేంద్రంలో ఉన్న కిషన్‌రెడ్డి ఇలాంటి మెలికలు పెడుతున్నారు.

కాళేశ్వరం అక్రమాలపై దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పదే పదే డిమాండ్ చేశారు. అలా చేస్తే.. 48 గంటల్లోనే ఈ కేసు విచారణ చేపట్టేలా చూస్తానని అన్నారు. సీబీఐకి ఇచ్చి ఇన్ని రోజులైంది.. కిషన్‌రెడ్డి ఎక్కడా మాట్లాడటం లేదు. సీబీఐ దర్యాప్తును ఆపాలని కేటీఆర్ చెప్పారు కాబట్టే.. కిషన్‌రెడ్డి అమలు చేశారు. కేటీఆర్, కిషన్‌రెడ్డి మధ్య అంతటి అవినాభావ సంబంధం ఉంది” అని సీఎం అన్నారు.

**నా మాటలతో లోకేశ్‌కు ఎలాంటి సంబంధం లేదు**

తాను ఒక సీఎంగా ఏపీ సీఎం చంద్రబాబును కలిశానని రేవంత్‌రెడ్డి అన్నారు. “చంద్రబాబును కలవడంలో ఎలాంటి దాపరికాలు లేవు. నేను అన్న మాటలతో లోకేశ్‌కు ఎలాంటి సంబంధం లేదు. లోకేశ్‌ను చీకట్లో ఎందుకు కలిశారో కేటీఆర్ చెప్పాలి. లోకేశ్ తమ్ముడిలాంటి వాడని కేటీఆర్ అంటున్నారు. తమ్ముడిలాంటి వాడైతే కష్ట కాలంలో అన్నలా ఎందుకు వ్యవహరించలేదు? చంద్రబాబును జైల్లో పెడితే హైదరాబాద్ రోడ్లపైకి జనం వచ్చారు. ఆ జనాన్ని కేటీఆర్ ఎందుకు కొట్టించారు?” అని ప్రశ్నించారు.

## ఆ నేతలకు ఇప్పుడే విలువలు గుర్తుకొచ్చాయా?: కడియం శ్రీహరి

మొదటి పేజీ తరువాయి


నియోజకవర్గంలోని చెరువులన్నీ నిండాయన్నారు. కాలువల్లో పూడిక తీయించి మరమ్మతులు చేసి సాగునీరు అందించినట్లు చెప్పారు.

“రేవంత్‌రెడ్డి సహకారం వల్లే అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలతోనే ఉంటా.. ప్రజల కోసమే పనిచేస్తా. కేసీఆర్ గత ప్రభుత్వంలో 36 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్నారు. చేర్చుకున్న వారిలో ఇద్దరిని మంత్రులను కూడా చేశారు. అప్పుడు భారత రాష్ట్ర సమితిలో చేరిన వారెవరూ రాజీనామా చేయలేదు. ఆ పార్టీ అగ్రనేతలకు ఇప్పుడే విలువలు గుర్తుకొచ్చాయా? సభాపతి నోటీసు ఇచ్చారు.. ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉంటా” అని కడియం శ్రీహరి అన్నారు.

## ఒడిశా To గుజరాత్:

### ఏపీ మీదుగా మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్

మొదటి పేజీ తరువాయి




గుజరాత్‌లోని సూరత్‌కు సమీపంలోని ఉద్నా రైల్వేస్టేషన్ మధ్య ఈ రైలు నడుస్తుందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. మార్గమధ్యంలో ఉత్తరాంధ్రలోని 2 స్టేషన్ల మీదుగా వెళ్లనుంది. పేద, మధ్యతరగతికి మెరుగైన ప్రయాణం అందించే ఉద్దేశంతో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను భారతీయ రైల్వే నడుపుతోంది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 11 రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో కొన్ని రైళ్లు తెలుగు రాష్ట్రాల మీదుగా ప్రయాణిస్తున్నాయి. తాజాగా బ్రహ్మపుర–ఉద్నా అమృత్ భారత్ రైలు అందుబాటులోకి రానుంది. దీన్ని ఎప్పటి నుంచి ప్రారంభించేదీ మంత్రి వెల్లలడించలేదు. బ్రహ్మపుర, ఉద్నా మధ్య మొత్తం 12 స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది. అందులో ఉత్తరాంధ్రకు చెందిన పలాస, విజయనగరం స్టేషన్లు ఉన్నాయి.

అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఫీచర్లు ఇవే..మొత్తం 22 ఎల్‌హెచ్‌బీ బోగీల్లో 12 స్లీపర్, 8 జనరల్, 2 లగేజీ కోచ్‌లు ఉంటాయి. సీసీటీవీ కెమెరాలు, ప్రతి సీటు వద్ద మొబైల్ ఛార్జింగ్ పాయింట్, సమాచార వ్యవస్థ, బయో వ్యాక్యూమ్ టాయిలెట్లు, సెన్సార్ కుళాయిలు వంటి సదుపాయాలు ఈ రైలులో ఉంటాయి. సుదీర్ఘ ప్రయాణాలకు అనుగుణంగా సౌకర్యవంతమైన సీట్లు, ఎల్‌ఈడీ లైట్లు,ఆధునిక డిజైన్లలో ఫ్యాన్లు, స్విచ్‌లు ఉన్నాయి. ఒకేసారి 1800 మంది వరకు ప్రయాణించే వీలుంటుంది. 800 కి.మీలకు పైగా దూరంలోఉన్న నగరాలను కలుపుతూ ఈ రైళ్లు సేవలందిస్తాయి. గరిష్ఠంగా 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి.

## రాహుల్ ప్రెస్‌మీట్‌లో ఫోన్ నంబర్..

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయోగ్‌రాజ్‌కు చెందిన అంజనీ మిశ్రా అనే వ్యక్తికి గురువారం నుంచి ఉన్నట్టుండి విపరీతంగా ఫోన్ కాల్స్ వస్తున్నాయట. ఏంటా అని ఆరా తీస్తే.. తన ఫోన్ నంబరును కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తన ప్రెస్‌మీట్‌లో పేర్కొన్నాడని తెలిసిందంటున్నారు మిశ్రా. ఇంతకీ ఏం జరిగిందంటే..?

‘ఓటు చోరీ’ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమం మధ్య రాహుల్ తన ఫోన్ నెంబర్‌ను పేర్కొన్నారని మిశ్రా ఆరోపిస్తున్నారు. దీంతో ఆ ప్రెస్‌మీట్ తర్వాత నుంచి తనకు విపరీతంగా ఫోన్ కాల్స్ వస్తున్నాయని పేర్కొన్నారు.

తాను 15 ఏళ్లుగా అదే ఫోన్ నెంబర్ వాడుతున్నానని.. ఇప్పుడు వరుసగా కాల్స్ వస్తుండడంతో తనకు సమస్యగా మారిందని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ పేర్కొన్నట్లుగా అసలు తాను ఓటరు తొలగింపు విషయంలో ఎటువంటి దరఖాస్తు చేయలేదని వెల్లడించారు. ప్రెస్ బ్రీఫింగ్‌లో రాహుల్ తన ఫోన్ నెంబర్‌ను పేర్కొన్నారని తెలిసి ఆశ్చర్యపోయానన్నారు. ఎలాంటి దరఖాస్తు పెట్టనప్పుడు తన నెంబర్ వారి దగ్గరకు ఎలా వెళ్లిందని ప్రశ్నించారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

ఓట్ల చోరీ అంశంపై రాహుల్ గాంధీ ప్రెస్‌మీట్

రాహుల్ గాంధీ గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు సాఫ్ట్‌వేర్ ద్వారా వ్యవస్థీకృతంగా వివిధ రాష్ట్రాల్లో తమ ఇష్టానుసారం ఓటర్ల జాబితాల్లో మార్పులు (%ఎశీవ జష్ట్రశీతీఱ%) చేస్తున్నారని ఆరోపించారు. కర్ణాటకలోని అలంద్, మహారాష్ట్రలోని రజోరా అసెంబ్లీ నియోజకవర్గాలే దీనికి ఉదాహరణ అని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నవారిని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్‌కుమార్ రక్షిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. బయటి రాష్ట్రాల ఫోన్లను ఉపయోగించి అలంద్‌లో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అగంతకులు 6,018 ఓట్లను తొలగిస్తే, అదే విధానంలో మహారాష్ట్రలోని రజోరా నియోజకవర్గంలో 6,850 మంది కొత్త ఓటర్లను చేర్చారని వెల్లడించారు. ఈ క్రమంలో పలువురి పేర్లు, వారికి సంబంధించిన వివరాలను ఆయన మీడియా ముందు వెల్లడించారు.

## ఈసీ కీలక నిర్ణయం..

### 474 రాజకీయ పార్టీలపై వేటు..

మొదటి పేజీ తరువాయి

గత ఆరేళ్లలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. తొలి దశలో భాగంగా ఈ ఆగస్టులో 334 పార్టీలను రద్దు చేసిన విషయం తెలిసిందే.

“రెండో దశలో భాగంగా 474 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను సెప్టెంబర్ 18న జాబితా నుంచి తొలగించాం. గత ఆరేళ్లుగా ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. దీంతో గత రెండు నెలల వ్యవధిలో మొత్తంగా 808 రాజకీయ పార్టీలను రద్దు చేశాం” అని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇప్పటివరకు 2520 గుర్తింపు లేని నమోదిత రాజకీయ పార్టీలు (%=ఖుూ%) ఉండగా, తాజా తొలగింపుతో ఈ సంఖ్య 2046కు తగ్గిందని తెలిపింది. ప్రస్తుతం ఆరు జాతీయ పార్టీలు, 67 ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

## ‘మన శరీరం తిరుగుబాటు చేస్తుంది’:

### ఐఎస్ఎస్ అనుభవాన్ని వెల్లడించిన శుభాంశు శుక్లా

మొదటి పేజీ తరువాయి

“స్పేస్ మిషన్ ప్రారంభమైన దగ్గరి నుంచి ఎంతో ఉత్సుకత ఉంటుంది. అయితే మనం మైక్రోగ్రావిటీ పరిస్థితులకు చేరుకుంటాం. అవి మన శరీరానికి పూర్తిగా కొత్త. దాంతో అంతా మారిపోతుంది. రక్తప్రసరణలో తేడా వస్తుంది. ముఖం ఉబ్బుతుంది. గుండెవేగం మందగిస్తుంది. మీ వెన్నెముక సాగుతుంది. తరచూ నడుము నొప్పి వస్తుంటుంది. మీ పొట్టలోని పదార్థాలన్నీ తేలినట్టుగా అనిపిస్తాయి. దాంతో ఆకలి అనిపించదు. అంతరిక్షంలోకి వెళ్లిన మరుక్షణం నుంచే ఈ మార్పులన్నీ వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మనం శరీరం తిరగబడుతుంది” అని శుక్లా వెల్లడించారు.

ఐఎస్ఎస్‌లో ఉన్న సమయంలో భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన సంగతి తెలిసిందే. ఆ సంభాషణకు ముందు తాను క్లిష్ట పరిస్థితి ఎదుర్కొన్నట్లు చెప్పారు. అప్పుడు తనకు వికారంగా అనిపించిందని, తలనొప్పితో బాధపడ్డానని చెప్పారు. “వికారానికి మందులు వేసుకుంటే మగత ఉంటుందని అవి కూడా వేసుకునే వీలు లేకుండా పోయింది” అని చెప్పారు.

అప్పుడు తమ బృందం సభ్యులు ఎంతో సహకరించారని చెప్పారు. అక్కడ వ్యోమగాములు ఒకరిపై ఒకరు ఆధారపడాల్సి ఉంటుందని అన్నారు. ఐఎస్ఎస్‌లోని పరిస్థితులు మన సహనానికి పరీక్ష పెడతాయని చెప్పారు. అయితే బృంద కృషి, పట్టుదల ఎంతో అవసరం అని అన్నారు. అంతరిక్ష యాత్ర కోసం ఏడాది కాలం అమెరికా శిక్షణ పొందిన శుభాంశు శుక్లా.. జూన్ 25 నుంచి జులై 15 వరకూ ఆయన రోదసీ యాత్ర నిర్వహించిన సంగతి తెలిసిందే.

## వచ్చే నెలలో మోదీ-ట్రంప్ భేటీ..?

మొదటి పేజీ తరువాయి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అక్టోబర్‌లో మలేసియాకు వచ్చే అవకాశముందని ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీంఇటీవల పేర్కొన్నారు. ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి హాజరవ్వాలనుకుంటున్నట్లు ట్రంప్ తనకు ఫోన్ చేసి చెప్పారన్నారు. అయితే ఈ భేటీపై ఇంకా అమెరికా, భారత ప్రభుత్వాలు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇటీవల మోదీ పుట్టినరోజు సందర్భంగా ట్రంప్ ఆయనకు ఫోన్‌కాల్ చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఏడాది ఇండియాలో జరగనున్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సుకు రావాలని మోదీ ట్రంప్‌ను కోరగా అందుకు ఆయన అంగీకరించినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

మోదీ స్నేహితుడే.. అయినా

రష్యా నుంచి అధిక స్థాయిలో చమురు కొనుగోలు కారణాన్ని చూపుతూ ట్రంప్ భారత్‌పై టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు ఇటీవల హాజరైన ప్రధాని మోదీ అక్కడ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీలు నిర్వహించారు. ఈ భేటీ అనంతరం చైనా చీకటి వలయంలో భారత్ చిక్కుకున్నట్లు ట్రంప్ విమర్శలు గుప్పించారు. అనంతరం కొన్ని గంటల్లోనే తన స్వరం మార్చారు. భారత్, అమెరికా మధ్య బంధం చాలా ప్రత్యేకమైందని పేర్కొన్నారు. దాని గురించి ఆందోళన చెందనక్కర్లేదని తెలిపారు. ప్రధాని మోదీ ని ప్రశంసలతో ముంచెత్తారు. ప్రధాని మోదీ సన్నిహిత స్నేహితుడే అయినా రష్యా నుంచి చమురు కొనడం వల్ల అధిక సుంకాలను విధించాల్సి వచ్చిందని స్పష్టంచేశారు.

## కోకాపేట్‌లో దారుణం..

### కత్తితో దాడి చేసి భర్తను హతమార్చిన భార్య

మొదటి పేజీ తరువాయి



రక్తపు మడుగులో పడి ఉన్న బాధితుడు కృష్ణజ్యోతి బోరాను ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. భార్యాభర్తలను అస్సాంకు చెందిన వారిగా గుర్తించారు. ఘటనాస్థలానికి చేరుకున్న నార్సింగి పోలీసులు భార్యను అరెస్టు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా కృష్ణజ్యోతి బోరా.. భార్యను వేధిస్తున్నట్లు వారు తెలిపారు. ఈక్రమంలో గురువారం రాత్రి గొడవ చోటు చేసుకున్నట్లు చెప్పారు.

# స్కూల్ ఆవరణను శుభ్రం చేసిన బిజెపి నాయకులు




**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా శుక్రవారం వేములవాడ బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు శాత్రాజ్ పల్లి ప్రైమరీ స్కూల్లో ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ భారత ప్రధాని పుట్టినరోజు గాంధీ అడుగుజాడల్లో జరుపుకోవాలని పిలుపునివ్వడంతో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోలా కృష్ణస్వామి, రేగుల మల్లికార్జున్, పిన్నింటి హ్యాన్మండ్లు బిళ్ళ కృష్ణ, గుడిసె మనోజ్ కుమార్, కొన్నాల రఘుపతి, దాసరపు నాగరాజు, రేగుల రాజ్ కుమార్, మల్లేశం యాదవ్, నేరెళ్ల సాయి, రేగుల శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

## మోడీ బర్త్ డే ఫ్లెక్సీ చింపివేసిన గుర్తుతెలియని వ్యక్తులు

### - పోలీసులకు బిజెపి నేతల ఫిర్యాదు





**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా వేములవాడ పట్టణ బిజెపి శాఖ ఆధ్వర్యంలో కోరుట్ల రోడ్ లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చింపేశారు. ఉద్దేశపూర్వకంగానే ఫ్లెక్సీ ని చించి వేశారని బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, శుక్రవారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో పట్టణ ఎస్ఐ ఎల్లా గౌడ్ కు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి కన్న చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, పిన్నింటి హనుమాన్లు, బిల్ల కృష్ణ, గుడిసె మనోజ్, రేగుల రాజు, నేరెళ్ల సాయి, కీసర యశ్వంత్, కోల మారుతి పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి వైపు యువత పయనించడం అభినందనీయం

### - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
స్వయం ఉపాధి వైపు యువత పయనించడం అభినందనీయమని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని 2వ బైపాస్ రోడ్డులో శుక్రవారం మెన్స్ వెర్ ను ఆయన ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా స్వయం ఉపాధి కోసం కృషి చేయడం అభినందనీయం అన్నారు. స్వయం ఉపాధి కోసం కృషి చేస్తున్న యువతకు ప్రభుత్వం ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మెన్స్ వేర్ నిర్వాహకులు, యువత పాల్గొన్నారు.

## వార్షిక తనిఖీలలో భాగంగా పుల్కల్ పోలీసు స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ

### -స్టేషన్ అధికారి, సిబ్బంది పని తీరు బాగుందని కితాబు



**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
వార్షిక తనిఖీలలో భాగంగా సంగారెడ్డి జిల్లా పుల్కల్ పోలీసు స్టేషన్ ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించారు. ఈ సందర్భంగా పుల్కల్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, డిఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల మెంటేనేన్స్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వాహణలో అంకిత భావంతో పని చేయాలని, ఎవరికీ కేటాయించిన విధులను వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే పోలీసు శాఖకు మంచి పేరు వస్తుందన్నారు. డ్యూటీ పరంగా లేదా వ్యకిగతంగా ఎలాంటి సమస్య ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకురావొచ్చని చెప్పారు. పోలీస్ స్టేషన్, రికార్డుల మెయింటనెన్స్ బాగుందని, అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.
అనంతరం పుల్కల్ మండల పరిదిలో 161 జాతీయ ప్రధాన రహదారిపై అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న (బ్లాక్ స్పార్ట్) ను ఎస్పీ ప్రత్యేకంగా సందర్శించి, వాహనాల వేగం అదుపునకు ర్యాంబుల్ స్ట్రిప్స్, ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలలో ఎస్పీ వెంట సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, జోగిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ఎస్ఐ విశ్వజన్ లు ఉన్నారు.

# సంగుపేట రైతు వేదికలో ఘనంగా రైతు సదస్సు...వ్యవసాయ ప్రదర్శన





**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం సంగుపేట గ్రామములోని రైతువేదికలో తెలంగాణ రైతువిజ్ఞాన కేంద్రం సంగుపేట ఇఫ్కో వారి ఆధ్వర్యంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి వచ్చిన డాక్టర్ రవీందర్ నాయక్ రైతులను ఉద్దేశించి సాగులో మెలకువలు ప్రస్తుత యాజమాన్య పద్ధతులను క్లుప్తంగా వివరించారు. వ్యవసాయ విద్యార్థులు నిర్వహించిన వివిధ వ్యవసాయ నమూనా ప్రదర్శనలు రైతులందరూ శాస్త్రవేత్తల ఇఫ్కో వారి ఆధ్వర్యంలో వీక్షించడం జరిగింది. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కే. అరుణ, డాక్టర్ నిర్మల, కే.రాహుల్ విశ్వకర్మ వరి, ప్రత్తి, కంది, మొక్కజొన్న, అలాగే కూరగాయల పంటల యాజమాన్యంలో చేపట్టాల్సిన సాగు మెలకువలు గురించి క్లుప్తంగా తెలియజేశారు. జోగిపేట డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు జి.రమాదేవి మాట్లాడుతూ పురుగుల మందులు వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ ఎం.ఆర్ కృపా శంకర్ నానో యూరియా నానో డిఏపి యొక్క ఆవశ్యకత, వాడే విధానం రైతులకు తెలియజేశారు. ఇఫ్కో అసిస్టెంట్ మేనేజర్ జె.ఎస్. చంద్రన్న రైతులకు సంకటహరణ బీమా యోజన గురించి క్లుప్తంగా వివరించారు. ప్రతి నానో ఎరువు బాటిల్ పై పదివేల బీమా కవరేజ్ లభిస్తుందని గరిష్టంగా రూ.2 లక్షల వరకు బీమా పరిమితి ఉంటుందన్నారు. అలాగే ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే 100 శాతం పరిహారం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్ నుండి వచ్చిన డాక్టర్ ఆలీబాబా వ్యవసాయ విద్యార్థులకు రైతుల నుండి సమస్యలు సేకరించి మంచి సాగు చిట్కాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం ఇఫ్కో వారి ఆధ్వర్యంలో ప్రతి రైతుకు వేప మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, ఆయా గ్రామ రైతులు, యంగ్ ప్రొఫెషనల్ -2 రేఖా మనోజ్, యంగ్ ప్రొఫెషనల్ -1 యస్.శ్రీకాంత్, కే.ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.




## గిజిగాడి గూడు.. నైపుణ్యం చూడు

- తాటి చెట్టు పై వేలాడుతున్న గిజిగాడు అల్లిన గూళ్ళు

చిగురుమామిడి, సెప్టెంబర్ 19 కరపత్రం ప్రతినిధి
మండలంలోని చిన్న ముల్కనూర్ గ్రామంలో రుద్ర కుంట చెరువులో ఉన్న తాటి చెట్టు పై గిజిగాడు నిర్మించుకున్న గూళ్ళు అత్యద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యంతో 'గిజిగాడు పక్షి' నిర్మించిన వేలాడే గూళ్ళు దారి వెంట వెళ్తున్న వీక్షకులను అబ్బుర పరుస్తున్నాయి. అందంలో, గూడు నిర్మాణంలో, వైభవంలోనూ, పక్షజాతుల్లో గిజిగాడికి సాటి రారెవ్వరు. తేలికపాటి గడ్డిపోచలతో టుంగుటూయాలలు అందులో మెత్తని పాన్పులు, గదులు నిర్మించుకొని రాత్రనక, పగలనక వీచే పిల్ల గాలులకు హాయిని గోల్పే ఉయ్యాలలు ఊగే గూడు కట్టడంలో గిజిగాడు ప్రదర్శించే కళాత్మకత, నైపుణ్యత, నేర్పరితనం, కంప్యూటర్ యుగం లో మానవుడికి కూడా సాధ్యం కానిది. ఈ పక్షి జాతిలో మగ పక్షి మాత్రమే చక్కని ఇంజనీరింగ్ ప్రతిభతో అందంగా గూడు నిర్మించి ఆడ గిజగాడికి ఆకర్షిస్తుంది. ఈ గిజిగాడు నిర్మించుకున్న గూళ్ళు 'నేటితరం' కెమెరాకు చిక్కాయి..

## ఆపదలో ఉన్న వారికి అండగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్







### - సీఎంఆర్ఎఫ్ నిధుల సహాయంతో లబ్ధిదారులకు ఆర్థిక సాయం

కుత్బుల్లాపూర్, కరపత్రం ప్రతినిధి
ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, సహాయహస్తం అందించడంలో ఎల్లప్పుడూ ముందుండే బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మరోసారి తన సేవా మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. 129 సూరారం డివిజన్ , షాపూర్ సంజయ్ గాంధీ నగర్కు చెందిన భారతం ప్రభావతి భర్త బి. వెంకట్ రావు, 125 గాజులరామారం డివిజన్ లో నివాసం ఉండే దూదేకుల ఖలీల్ తండ్రి జలీల్ ఆరోగ్య పరిస్థితి బాగాలేదని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వివేకానంద్ ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ప్రభావతికి రూ.1.10 లక్షలు, ఖలీల్కు రూ.2.10 లక్షలు మంజూరు చేయించారు. చింతల్లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా ఈ సాయం లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ%-% "ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకునే నాయకుడు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. అర్హులైన వారు అందరూ ముఖ్యమంత్రి సహాయ నిధిని వినియోగించుకోవాలని" విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, సమ్మయ్య యాదవ్, సుంకరి చందు, చిన్నా చౌదరి, శివా నాయక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మొదలైన బతుకమ్మ పండుగ వేడుకలు...

### - నిజాంపేట్లో 1000 మంది మహిళలకు చీరల పంపిణీ, పేద విద్యార్థికి స్కాలర్షిప్ అందజేసిన కాంగ్రెస్ నాయకుడు కొలన్ హనుమంత్రెడ్డి"



**నిజాంపేట్, సెప్టెంబర్ 19 కరపత్రం ప్రతినిధి**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకాల్పలో బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నల్లమల్లిస్ ఆదర్శ మహిళ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండర్ %ం% చైర్పర్సన్ నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి (రాధ) ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 1000 మంది మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్మిక, గనుల శాఖా మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి, తెలంగాణ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాల్రెడ్డి రాంరెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్రెడ్డి, విశిష్ట గోల్డ్ & డైమండ్ అధినేత పలబట్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొలన్ హనుమంత్రెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ సంప్రదాయ పండుగ అయిన బతుకమ్మ మన ఆడబిడ్డల గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది అని అన్నారు. సమాజంలో వెనుకబడిన వారికి తోడుగా నిలిచి, పేద విద్యార్థులకు సహాయం చేయడం మన సమాజ ధర్మం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రస్ట్ తరఫున ఒక పేద విద్యార్థికి రూ. 5,000 స్కాలర్షిప్ అందజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు కె. సరిత, శ్రీదేవి, అరుణ, రాధిక, అనంతలక్ష్మి, స్రవంతి, శశికళ, పల్లా శశికళ, విజయశ్రీ, అనిత, పద్మ, వీణ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూడా హాజరై పండుగ వేడుకలకు మరింత శోభ చేకూర్చారు. ఈ కార్యక్రమం సందడి, ఉత్సాహ వాతావరణంలో ముగిసింది.
10

## పుట్టపాక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో

### గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయ బృందం మహిళల పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా సందేశం తో అవగాహన సదస్సు

**కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్ 19:**
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం పుట్టపాక గ్రామంలో గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక బృందాల ( ఎస్ హెచ్ జి ఎస్ ) మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే సదుద్దేశంతో ALEAP (అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ప్రెనియర్ ఆఫ్ ఇండియా) ప్రపంచ బ్యాంక్ నిధులతో భారత ప్రభుత్వ నిర్వహిస్తున్న ఆర్ ఏ ఎం పి (రైసింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్ఎంఇ పెర్ఫార్మెన్స్) లో భాగంగా తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ మరియు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (SERP) లతో సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక రోజు అవగాహన సదస్సు ( నిర్వహించడం జరుగుతోంది. ఔత్సాహిక మహిళలకు అవగాహన సదస్సు తదనంతరం పదిహేను రోజుల పరిశ్రమ నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్ మెళుకువలు మరియు నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిర్వహించారు. ఆచరణీయ పరిశ్రమలకు ఉద్యమి రిజిస్ట్రేషన్ మరియు బ్యాంకుల ద్వారా ఋణ సహాయం కూడా ఇప్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో శ్రీమతి పద్మజ ప్రభాకర్, అలీఫ్ సెక్రటరీ. శ్రీదేవి ల్యాండ్ కమిటీ మెంబర్, శ్రీ మాధవి డైరెక్టర్, సిల్క్ డెవలప్మెంట్ శ్రీ భరత్ రెడ్డి ఫీల్డ్ మేనేజర్ అలీఫ్ హైదరాబాద్, పద్మశ్రీ అవార్డు గజం గోవర్ధన్, పుట్టపాక పద్మశాలి సంఘం అధ్యక్షులు గజం సత్యనారాయణ, పుట్టపాక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజం సత్యం పుట్టపాక మహిళా సంఘాలు మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించండి ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
మెదక్ జిల్లామాసాయిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం అభివృద్ధి పనులు పారిశుద్ధ్యం, బతుకమ్మ పండుగ నేపథ్యంలో ఏర్పాట్లు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు వంటి వాటిపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే సునీత రెడ్డి సమీక్ష జరిపారు ఈ సందర్భంగా గ్రామపంచాయతీలో నిధులు లేకున్నా తమ సొంత డబ్బులు వెచ్చించి పారిశుద్ధ్యం, నిర్వహణ, మంచినీటి సరఫరా తడి పొడి చెత్త సేకరణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యేకు వివరించారు. అదేవిధంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలు, ఇల్లు వివరాలను వివరించారు. పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని నూతన బిల్డింగ్ లకు నిధులు మంజూరు అయ్యేలా చూడాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. రామంతాపూర్ తండాలో రెండు వాటర్





ట్యాంకులకు మంజీరా నీటి సరఫరా రావడం లేదని, గ్రామపంచాయతీ, అంగన్వాడి కేంద్రం భవనాలకు నిధులు మంజూరైన పనులు ప్రారంభించకపోవడంతో ఇబ్బందులు అవుతున్నాయని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులపై పని భారం ఎక్కువ అయిందని, గుర్తింపు ఉండడం లేదని పంచాయతీ కార్యదర్శులు వాపోయారు. నిధులు లేక తమ సొంత డబ్బులు వెచ్చించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పక్క రాష్ట్రాల్లో పంచాయతీ కార్యదర్శులకు మంచి గుర్తింపు ఉందని కానీ తెలంగాణలో మాత్రం కిందిస్థాయి వర్కర్లుగా చూస్తున్నారని ఈ పద్ధతిని మార్చేలా ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లాలని కోరారు. సమీక్ష నిర్వహించిన అనంతరం పలు గ్రామాలకు చెందిన ప్రజలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను పలువురు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విగ్నేశ్వర్ తహసిల్దార్ జ్ఞాన జ్యోతి డి ఎల్ పి ఓ యాదయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోర్టు ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి న్యాయవాదుల నిరసన..

**కరపత్రం ప్రతినిధి మీద నర్సాపూర్**





సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కోర్టు ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి న్యాయవాదులు నిరసన తెలిపారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు అరికట్టి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. మెట్రోపాలిటన్ కోర్టు న్యాయవాది అరుణ్ కుమార్, ఇతర న్యాయవాదులపై జరిగిన దాడిని హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖండిస్తున్నట్లు న్యాయవాదులు తెలిపారు. మాజీ ఏజీపీ కన్నోజు రామకృష్ణ మాట్లాడుతూ సంగారెడ్డిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలని ధర్నా చేస్తుంటే పోలీసులు ఆయనను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకే రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకువచ్చి, అక్రమంగా అరెస్టు చేసిన న్యాయవాది విష్ణువర్ధన్ రెడ్డిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు

## చెరువు కట్టపై పేరుకుపోయిన గడ్డి, ప్లాస్టిక్ ను తొలగించిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది..

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట : సెప్టెంబర్ 19**






కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణ కేంద్రంలోని నాయిని చెరువు లో గత రెండు రోజులుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు, ప్రజలకు అవగాహన, మున్సిపల్ కార్యాలయం చుట్టూ పరిసరాలను శుభ్రం చేయడం, చెత్తను తొలగింపు కార్యక్రమం నిర్వహించగా మూడో రోజు శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ ఆదేశాల మేరకు పట్టణంలోని నాయిని చెరువు కట్టపై ప్లాస్టిక్, గడ్డిని తొలగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి మాట్లాడుతూ నేను స్వచ్ఛత వైపు అంటూ నాయిని చెరువు ప్రాంతంలో ప్లాస్టిక్ తొలగించామని, గడ్డిని తొలగించడం జరిగిందని ఆయన అన్నారు ప్రజలు, యువకులు చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛత వైపు అడుగులు వేసే సమయం ఇది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, శ్రీనివాస్, జునియర్ అకౌంట్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, జూనియర్ అకౌంటెంట్ అనిల్, శానిటరీ ఇన్స్ పెక్టర్లు మహేష్, సదానందం, జూనియర్ అసిస్టెంట్ మధుసూదన్ తో పాటు బిల్ కలెక్టర్లు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పలువురు పాల్గొన్నారు.

## శ్రీ హనుమాన్ అఖాడను ప్రారంభిన ఎమ్మెల్యే




**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్ (రామగుండం), సెప్టెంబర్ 19:**
ఎన్టీపీసీ విశ్వభారతి హైస్కూల్ లో ఏర్పాటు చేసిన శ్రీహనుమాన్ అఖాడ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువతలో క్రమశిక్షణ, ధైర్యం, శారీరక దృఢత, మానసిక స్థైర్యం పెంపొందించడంలో అఖాడ శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని, పాఠశాల స్థాయిలోనే ఈ విధమైన శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, దేశభక్తి, సేవాభావం మరింత బలపడతాయని తెలిపారు. అలాగే విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రీడల్లో, శారీరకాభివృద్ధిలో కూడా ముందంజలో ఉండాలని సూచించారు. విశ్వభారతి పాఠశాలలో ప్రారంభించిన శ్రీహనుమాన్ అఖాడ శిక్షణ కేంద్రం ద్వారా స్థానిక విద్యార్థులు మాత్రమే కాకుండా, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు తీర్చిదిద్దబడతారని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ద్వారా కబడ్డీ, రెజ్లింగ్, యోగా వంటి శారీరక వ్యాయామాలపై ప్రత్యేక శిక్షణ లభించనుందని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు బందారపు యాదగిరిగౌడ్, కాంగ్రెస్ నాయకులు ఆసిఫ్ పాషా, అఖాడ నిర్వాహకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సీఎండీ కు దక్షిణ భారతదేశంలో అత్యుత్తమ సీఎండీగా అవార్డు

**- ప్రతిష్టాత్మక ఏసియా పసిఫిక్ హెచ్ఆర్ఎం కాంగ్రెస్ ద్వారా పురస్కారం ప్రదానం**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 19:**
సింగరేణి సంస్థను అభివృద్ధి పథంలో నడుపుతూ, గత ఏడాది అత్యుత్తమ ఫలితాలు సాధించడంతో పాటు వివిధ వ్యాపార విస్తరణ చర్యలతో సంస్థకు గట్టి ఆర్థిక పునాదులు వేసిన సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ కు మరో ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. దక్షిణ భారతదేశంలో అత్యుత్తమ సంస్థల నాయకుల కేటగిరీలో అత్యుత్తమ సీఎండీగా గుర్తిస్తూ ప్రతిష్టాత్మక ఏసియా పసిఫిక్ హెచ్ఆర్ఎం కాంగ్రెస్ వారు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఏసియా పసిఫిక్ హెచ్ ఆర్ ఎం కాంగ్రెస్ వారు గురువారం బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో ఈ అవార్డును ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఈస్టర్న్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ఇన్ మేనేజ్మెంట్ (కోల్కతా) ఛైర్మన్, డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.పి.బెనర్జీ, అడ్వాంటేజ్ గ్రూప్ వ్యవస్థాపకురాలు స్మితి భట్ దియోరా తదితరులు




పాల్గొన్నారు. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సంస్థ ఆర్థిక వ్యవహారాలలో ఫైనాన్షియల్ ఇంజినీరింగ్ ప్రక్రియ చేపట్టి సంస్థకు బలమైన ఆర్థిక పునాది వేశారు. ముఖ్యంగా సింగరేణి చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రమైన ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాకును ప్రారంభించడంలో కీలకపాత్ర పోషించారు. వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశించడం కోసం రెండు ఏజెన్సీలను ఏర్పాటు చేసుకొని అధ్యయనం జరుపుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ కూడా దక్కించుకోవడం విశేషం. రాజస్థాన్ లో సోలార్, థర్మల్ ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందం చేసుకోవడంలో ప్రత్యేక చొరవ చూపారు. ముఖ్యంగా కార్మిక సంక్షేమ కార్యక్రమాలు, సమీప గ్రామాల్లో సామాజిక బాధ్యత కార్యక్రమాలు పెద్ద ఎత్తున అమలు చేయడాన్ని నిర్వాహకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. అదే సమయంలో కార్మిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా కార్మికులందరికీ కోటి రూపాయల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. సంస్థ వ్యాపార విస్తరణలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్వయంగా 20 వేల కు పైగా మొక్కలు నాటడాన్ని కొనియాడారు. గత ఏడాది కాలంగా చేపట్టిన విస్తృత అభివృద్ధి, సంక్షేమ, సీఎస్ఆర్ కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు బహూకరించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.
తనకు ప్రతిష్టాత్మక అవార్డు రావడంపై సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ హర్షం వ్యక్తం చేస్తూ.. ఇది సింగరేణి కార్మికులు, అధికారుల సమష్టి కృషికి దక్కిన గుర్తింపు అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని విశ్వవ్యాప్తం చేయడానికి ప్రతీ ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు.

# లాభాల వాటాను వెంటనే ప్రకటించాలి

**- సింగరేణి భవన్ ముందు టీబీజీకేఎస్ ధర్నా**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 19:**
సింగరేణి కార్మికులకు 35 శాతం లాభాల వాటాను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాదులోని సింగరేణి భవన్ ను తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఈ ధర్నా ముట్టడిని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కేసీఆర్ తన ప్రభుత్వ హాయంలో సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి కార్మికులకు అన్యాయం
అన్యాయం చేశారని అనేక సమస్యలతో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు కాక కార్మికులందరూ ఆందోళనలో ఉన్నారన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాల్లో 33 శాతం ఇవ్వకుండా కేవలం 16 శాతం మాత్రమే ఇచ్చి అభివృద్ధి పేరిట రూ.2289 కోట్లు పక్కన పెట్టారని ఇప్పటివరకు వాటి ఖర్చు వివరాలు తెలియజేయలేదు అన్నారు. ఈ సంవత్సరం కూడా అంతకన్నా ఎక్కువ





లాభాలు వచ్చాయని వాటి నుంచి 35 శాతం కార్మికులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో అడగకుండానే అనేక హక్కులు ఇచ్చినటువంటి కేసీఆర్ ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు అన్యాయం తలపెట్టే చర్యలకే పాల్పడుతున్నదన్నారు. కార్మికుల ఇవ్వాల్సిన హక్కులను ఇవ్వకుండా ఉన్న హక్కులను సైతం పోగొట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని, సింగరేణి కార్మికుల ఓట్లు దండుకోనికి అనేక హామీలు ఇచ్చినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో అవేమీ అమలు చేయకుండా ఉన్న హక్కుల్ని తీసేసి చర్యలకు పాల్పడుతున్నదన్నారు. దానిలో భాగంగానే 2024-25 సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటను పంచడంలో విపరీతమైన జాప్యాన్ని చేస్తూ మొత్తంగానే లాభాల వాటని ఎగ్గొట్టె కుట్రలో భాగంగా సింగరేణి సంస్థ చాలా నష్టాల్లో ఉందని, ఈ సంస్థ రానున్న పది సంవత్సరాలలో మూతపడే ప్రమాదం ఉందని చెబుతూ కార్మికులందరినీ భయాందోళ చెందే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతున్నదని,
దీన్ని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఎట్టి పరిస్థితిలో చూస్తూ ఊరుకోదని, తప్పకుండా సింగరేణి కార్మిక వర్గాన్ని మొత్తం ఏకం చేసి మొత్తం బొగ్గు ఉత్పత్తిని స్తంభింప చేసి హక్కులను సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శులు కాపు కృష్ణ, కేతిరెడ్డి సురేందర్ రెడ్డి పర్లపల్లి రవి, కుసన వీరభద్రం, మంగీలాల్, అన్వేష్ బండి రమేష్, నాగలి సాంబయ్య, బడితెల సమ్మయ్య, గడప రాజయ్య, నాగేల్లి వెంకటేశ్వర్లు, మేడిపల్లి సంపత్, రత్నం అవినాష్, పొగాకు రమేష్, పానుగంటి సత్తయ్య, పెట్టం లక్ష్మణ్, ముదుంపల్లి రాజేశం, దూట శేషగిరి, వాసర్ల జోసెఫ్ ఉప్పులేటి పర్వతాలు, జనగామ మల్లేష్, అప్సరపాషా, పుప్పాల రవీందర్ అంబటి శ్రీనివాస్, అధిక సంఖ్యలో 11 ఏరియాల నుంచి వచ్చిన టీబీజీకేస్ శ్రేణులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయు లకు

### పొనగంటి రవికుమార్ (పిజెఆర్)ఆధ్వర్యంలో ఘన సన్మానం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 19**
మోతుక్కులాగూడెం గ్రామానికి చెందిన మున్నూరు కాపు ముద్దుబిడ్డ లైన ఏబూషి శ్రీనివాస్, ఏభూషి సతీష్ కుమార్, ఉడుగుల సంపత్ లకు ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు వచ్చినందుకు మున్నూరు కాపు కులసభ్యులు అభినందనలు తెలుపుతూ మట్టిలో పుట్టి మట్టిలో పెరిగి మంచి ఆణిముత్యాలుగా తయారైనటువంటి మీరు ఇంకా అనేకమంది ఆణిముత్యాలు తయారు చేయాలని అప్పుడే సమాజంలో



అంటరానితనం పోతుందని నాయకులు కొనియాడారు .
ఈ కార్యక్రమంలో కడెం జనార్ధన్, పొన్నగంటి రవికుమార్ (పీజేఆర్),ఏభూషి కౌశిక్, ఆకుల రాజేందర్, కొలకానిరాజు,సందా మహేందర్,పొన్నగంటి సందీప్,పంతటి అరవింద్, ఆకుల పోచయ్య, మహేందర్,పొనగంటి సతీష్, రాజు,సీరియల విజయ్,ఏభూషి అజయ్,శెట్టి రాజు, పొనగంటి ప్రభాకర్,పొనగంటి శంకర్,సతీష్, సంపత్, స్వామి,ఉదయ్ భాస్కర్, సంపత్, అరుణ్,గణేష్, ఆకుల రాజు, భారీ సంఖ్యలో కుల బాంధవులు పాల్గొన్నారు